# రేప్! రేప్!! రేప్!!!

కె. సరోజ

ఆ రోజు బుధవారం. టెంపరేచర్ మైనస్ వన్‌లో వుంది. చాలా ఫాగీగా కూడా వుంది. డివోర్సు కోర్టు నుండి విరక్తిగా.... శ్మశానం నుండి తిరిగి వచ్చే వారిలా ఇంటికి చేరుకుంది నీలిమ. ఎంత ఆపుకుందామన్నా ఆమె దుఃఖం కట్టలు తెంచుకుంది.

గుండె ఎగసి పడుతోంది. నిస్త్రాణగా సోఫాలో వాలిపోయి రెండు చేతుల్లోనూ ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. అంతకంతకూ ఆ దుఃఖం అధికం కాసాగింది. ఆమెను ఓదార్చే దిక్కు లేదు.

ఈ రోజు నుండీ తను ఏకాకి.

తన భర్త అనీల్ తనకి విడాకులు ఇచ్చేశాడు.

తనెంత ప్రయత్నించినా, ప్రార్థించినా ఫలితం లేక పోయింది.

అంతా తన దురదృష్టం! లేకపోతే ఎందుకిలా జరుగుతుంది! ప్రశాంతంగా వున్న తన జీవితంలో ఎందుకీ పెను తుఫాను! ఏ నేరం చెయ్యని తను కఠిన శిక్షకు లోను కావల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో తిరిగి తను ఇండియా వెళ్లి.... ఎలా వుండగలదు! ఏమిటి మార్గం?

ఇక్కడే వుండటమా? లేక తల్లిదండ్రుల దగ్గర కెళ్లడమా! ఆ దుఃఖంలో కూడా ఆలోచించ సాగింది నీలిమ.

ఒక చిన్న సంఘటన మనిషి జీవితాన్ని ఎంత ఛిన్నాభిన్నం చేస్తుందో తనకు అర్థం అయింది. అసలందుకు తనే గొప్ప తార్కాణం. గతం సోపానాలాగా కళ్ల ముందు కదుల్తోంది.

** ** **

"హలో, రాగిణీ, రేపు సాయంత్రం ఆరు గంటలకు మహాకవి, ప్రముఖ రచయిత అయిన శ్రీ ఆరుద్రగారు మా ఇంటికి వస్తున్నారు. ఆయన ఇప్పుడు ఉత్తర అమెరికా పర్యటనలో వున్నారు. సన్మానం ఏర్పాటు చేయాలంటే... సమయం అనుకూలంగా లేకపోవడంతో మా ఇంట్లో గెట్ టుగెదర్ ఎరేంజ్ చేస్తున్నాను. మీకు సరదాగా వుంటే రావచ్చు" నమ్రతగా పలికింది నీలిమ.

"ఓహ్! నేనెందుకు రానూ! ఆయన్ని చూడాలని ఎప్పుడూ కలలు కనేదాన్ని. ఆయన అందం అంటే... నాకు మహా పిచ్చ అనుకో. ఇంతకు ముందయితే.. ఆయన వయస్సులో వున్నప్పటి ఫోటో ఒకటి నా ఆల్బమ్‌లో మొదటి పేజీలో పెట్టుకునేదాన్ని. ఇప్పుడు మరో యువ రచయిత ఫోటో పెట్టాననుకో. అయినా నాకీ అవకాశం కల్గిస్తున్నందుకు ధన్యవాదాలు.

ఇంతకీ ఎంతమందొస్తున్నారు?

"పదిమంది రావచ్చునుకుంటాను. అయినా ఇందులో బలవంతపు మాఘస్నానం ఏం లేదు లెండి. మీకు ఉత్సాహం అనుకూలం అన్నీ వుంటేనే...."

"అయ్యో! అదేమిటి నీలిమా, నేను రాకుండానా? అసలు ఈ టొరంటోలో నేను లేకుండా ఏమీ జరుగదు. ఇంతకాలం నన్ను చూస్తూంటే కూడా నీకు తెలీలేదన్న మాట! మరే! మీ ఇంట్లో 'భోజనం' తల్చుకుంటే నోరు ఊరుతోంది..."

"ఒ.కె. నేను వుంటానండి" చెప్పింది నీలిమ.

"ఒక నిమిషం మాట్లాడు. నీ మాటలు నాకు పన్నీటి జల్లు."

"ఏంటండి?"

"అది సరేగాని నీలిమా. మీ మార్కమ్ రోడ్ మీద ట్వెల్ హండ్రెడ్ బిల్డింగ్‌లో వుండే వెంకటలక్ష్మి భర్త చెవులు మెలిపట్టి కొడుతుండట, ముని మాణిక్యం నరసింహారావ్‌గారి కాంతం కథల్లోలాగా..."

"మీరు చూశారా?"

"చూడాలేమిటీ ఇలాంటివి! నిప్పులేందే పొగ వస్తుందా? మరేనేమో! ఆ వెంకటలక్ష్మి నేనెప్పుడు ఫోన్ చేసినా కొంపలో వుండదు. కెనడీయన్ల కంటే అన్యాయంగాను. ఎక్కడికి పోతుందో ఏమోగాని, మా వారైతే అలా తిరిగితే మర్నాడే పంపించేస్తారు.

"మన కెందుకండి?"

"ఇంకా నయం. మనక్కాకపోతే మరెవరికి! సాటి తెలుగు వాళ్లం, ఈ మాత్రం శ్రద్ధ తీసుకోకపోతే ఇంకెందుకూ!" దీర్ఘం తీసింది రాగిణి.

"నేనుంటానండీ."

"ఫోను పెట్టెయ్యకు ప్లీజ్" బతిమాలింది.

"స్టౌ మీద కూర మాడిపోతుందండి"

"ఫర్వాలేదు. ఫోను పట్టుకుని వుంటాన్లే, నువ్వు కూర కలియబెట్టి రావచ్చు. నాకేమో కాల్ వెయిటింగ్ ఫీచర్ వుంది కనుక ప్రోబ్లెబ్ లేదు..."

కొద్దిగా బాధగా నుదిటి మీద చిన్నగా కొట్టుకుంది నీలిమ.

"మరి... నిలిమా వారానికి ఎన్నిసార్లు?"

"రెండుసార్లు వంట చేస్తానండి. ఎవరైనా పిలిస్తే మాత్రం ఆ రోజు తాజాగా వండుతాను."

"నీ తెలివి తెల్లారినట్లే వుంది. వంట గురించి కాదు నేనడిగింది."

"మరేంటీ... షాపింగా అండీ?"

"అయ్యో ఖర్మ"

"మరైతే ఏంటండి"

"అదే... ...సెక్స్"

"భలేవారే! వంటేమో అనుకున్నాను. అయినా ఇవేం కబుర్లండీ మీకు! నలభయ్యో పడిలో పడబోతున్న మీరు... ..."

"ఇంకా నయం. ఇదే వయస్ససలు. అయినా నువ్వెంత అందంగా వుంటావంటే... ... ఆ రోజు పిక్నిక్‌లో మగవాళ్లందరి చూపులూ నీ మీదే!"

"నేనుంటానండి."

"ఆ మగవాళ్లందరూ నిన్ను అల్లా చూస్తుంటే... అబ్బో నా కెంత పులకింతగా వుందంటే... నా చేతుల మీది రోమాలు అలా నిలబడ్డాయనుకో..."

"నేనుంటానండి"

జవాబుకు ఎదురుచూడకుండా ఠక్కున ఫోను పెట్టేసాక... అయిదు నిమిషాలకి గాని నీలిమ కుదుట పడలేకపోయింది.

** ** **

నీలిమ మద్రాసులో పుట్టి పెరిగినా ఆమెలో అడుగడుగునా తెలుగుతనం వెల్లివిరుస్తుంటుంది. తెలుగు పదజాలంలోనూ, వాక్యాలలోను ఎక్కడా ఒక్క ఇంగ్లీషు పదం కూడా వుపయోగించకుండా, వాడిన పదం తిరిగి వాడకుండా ఆరుగంటలైనా అనర్గళంగా ఉపన్యసించగల ప్రతిభగలది!

తమిళం మాట్లాడినా అంత ధారాళంగానూ వుంటుంది.

ఇంగ్లీషు అయితే సరే సరి! నయాగరా జలపాతం లాగే! కొన్ని లక్షల ఇంగ్లీషు పదాలు ఆమెకి కంఠోపాఠం

నీలిమ తండ్రి శ్రీనివాసరావు మద్రాసులో జరిగే వివిధ తెలుగు సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలలోనూ ప్రముఖ పాత్ర వహిస్తుంటారు వృత్తిపరంగా ఇంజనీరైనా కూడా. ఆయన లేని సభ 'సభే'

కాదని ఆయన సాహితీ మిత్రులందరూ ఏక్రగీవంగా తీర్మానాని కొచ్చేశారు.

నీలిమ తల్లి శార్వాణి సంగీతంలో అపర సరస్వతి. సాహిత్యంలో మేటికాకపోయినా వాటిలో పరిజ్ఞానం వున్న వ్యక్తి. భర్తతో సరితూగగలదు. అటువంటి సంస్కృతి సాంప్రదాయాల మధ్య పుట్టి పెరిగిన నీలిమ.. ఎన్నో విషయాలలో వారిద్దరి కంటే ఎంతో ఎత్తు ఎదిగింది.

ఇప్పుడామె పాతికేళ్ల ప్రౌఢ.

నీలిమ భర్త అనీల్. అతనూ మద్రాస్‌లోనే పుట్టి పెరిగాడు. కానీ... అటు తెలుగు కానీ.. ఇటు తమిళం గానీ స్పష్టంగా మాట్లాడలేడు. అతని పొరపాటేం లేదు ఆ విషయంలో. తల్లిదండ్రుల పాశ్చాత్య భాషా వ్యామోహం వల్ల అతనలా తయారయ్యాడు. నీలిమతో పెళ్లి జరిగాక, ఆమెకు భాషపైన వున్న అధికారం చూసి.. తను కూడా బాగా మాట్లాడాలనుకుని.. అర్థం మారిపోయేలా మాట్లాడి.. హాస్య రసానికి బదులు అపార్థ రసాన్ని చవి చూడవలసి రావడంతో.

"స్వచ్ఛమైన తెలుగువారితో మీరు తెలుగు మాట్లాడకండి మహానుభావా" అని చెప్పింది నీలిమ.

'అనీల్ మంచి బాలుడు' అన్నట్లు భార్య మాటను పాటించాడు. అనీల్ మద్రాసు గిండీ ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఇంజనీరింగ్ చదివాడు. కాన్పూర్ ఐ.ఐ.టి.లో ఎం.ఇ. ముగించగానే, కెనడాకు ఇమ్మిగ్రేషన్ రావడం జరిగింది. ప్రస్తుతం టొరంటోలో ఒక ప్రముఖ కర్మాగారంలో ఇంజనీర్‌గా వున్నాడు.

అతని వయస్సు ఇరవై తొమ్మిది.


నీలిమ ఎం.ఎ. పాసైనా.. ఉద్యోగం చేయాలనే కోర్కె లేదు. అల్ప సంతోషి.

రాగిణికి వళ్లు వంగదు. కాబట్టి ఎప్పుడూ ఇంట్లోనే వుంటుంది. ఆమె భర్త, ఒక సంస్థలో సైంటిస్ట్. ఆమె పిల్లలు పదేళ్ల వినయ్, ఆరేళ్ల అభయ్. భర్త ఆఫీసుకు,, పిల్లలకు స్కూలుకు వెళ్లగానే... ఇంట్లోవున్న హీటింగ్ చాలదంటూ అదనంగా మరో రెండు హీటర్లు ఆన్ చేసుకుని... సోఫాలో కూర్చుని, కంఫర్టరు కప్పుకుని... వీడియోలో తెలుగు సినిమా చూస్తూ.. మధ్య మధ్య ఇళ్లలో వున్న తెలుగు స్త్రీ పురుషులకు వ్యత్యాసం లేకుండా ఫోన్లు చేసి తననూ, అటు నుంచి మాట్లాడే వ్యక్తినీ పొగిడి... మూడవ వ్యక్తిని తెగుడుతుంటుంది. సాయంత్రం నాలుగు తర్వాతే ఆ సోఫాకి విముక్తి.

అది ఆమె దినచర్యలోని ప్రధానాంశం.

నీలిమకు రాగిణి ఏ మాత్రం అర్థం కావడం లేదు.

ఒక రోజు ప్రేమగా, మరో రోజు ఆరోపణగా, 'నువ్వు మంచి స్నేహితురాలి వంటుంది. ఏమిటో గందరగోళం! పోన్లే తెలుగావిడ కదా! నాతో మాట్లాడితే ఆవిడకి తృప్తి కల్గుతోందంటున్నది కదా! అని సర్ది చెప్పుకుంటోంది తన మనస్సుకి. రాగిణికి అందమైన నీలిమ అంటే చాలా అసూయ. కానీ, నీలిమకు తెలియదా విషయం!



అరుంధగారు వచ్చారు. అతిథులంతా కూడా వచ్చారు. రాగిణి తన భర్త వూళ్లో లేడనీ, అనీల్‌నే తనకు రైడివ్వమని ఫోన్ చేసింది. అనీల్ వెళ్లి ఆమెను తీసుకువచ్చాడు. అందరూ ఎంత సంతోషంగా వున్నా ఎన్నడూ లేనిది అనీల్ చిటపట్లాడసాగాడు. అరుంధగారు త్వరగా వెళ్లిపోయారు. "ఇప్పుడు చీకటి పడిందిగా! మగవాళ్ల రైడిస్తే... భయం నాకు రేప్ చేస్తారని... తోడుగా నువ్వూ రా నీలిమా!"

అమాయకంగా ముఖం పెట్టింది రాగిణి. "అలాంటి భయమేం లేదులెండి. మీరేమీ అనామకుల్తో వెళ్లడం లేదు లెండి" చెప్పింది నీలిమ.

"నా జాగ్రత్త నాది. రేప్ అంటే భయంలేని వాళ్ల అర్ధరాత్రి అపరాత్రి తిరుగుతారు.

"అసలా ఆలోచనేమిటి?" అడిగింది నీలిమ.

"నువ్వు కూడా చెప్పావ్‌గా! ఈ మధ్య స్టేట్స్‌లో ఎవరో ఇండియన్ లేడీని రేప్ చేశారని" సాగదీసింది.

అనవసరంగా వాదించడం... అందులో... ఈమెతో. ఎందుకులే.. అని.. మౌనం వహించింది నీలిమ. రాగిణి డ్రైవ్ చేయగలిగిన నీరజ కార్లో వెళ్లిపోయింది.

ఆ రోజు రాత్రి పన్నెండు గంటలకు రాజుకుంది నిప్పు. రోజులూ - వారాలు - నెలలూ... సంవత్సరాలూ గడిచినా అది ఆరని చిచ్చయింది కానీ... చిచ్చుబుడ్డిలా కాలేదు.

నీలిమ జీవితం అనుక్షణం భర్త అనుమానంతో, వేధింపుల్తో సాధింపులతో, ఎత్తి పొడుపులతో దిన దిన గండంగా వుంది. బయటికి అడుగు పెట్టకుండా కట్టుదిట్టం చేశాడు. అవసరం అయితే లాస్ ఆఫ్ పేతో సెలవలు కూడా తీసుకుంటున్నాడు లేనిపోని అక్రమ సంబంధాలన్నీ అంటగట్టి..

నిజం ఒప్పుకో, నిజం ఒప్పుకో అని బాధిస్తున్నాడు. ఆమెకి ఎప్పుడెప్పుడు ఎవరెవరు రైడిచ్చారో చెప్పమని... ఆమె వాళ్లతో ఎలా మసలుకునేదో వివరించమని... తాను ఇంట్లో లేనప్పుడు ఏ మగవాళ్లయినా వచ్చేవాళ్లా! లేదా! అని నిలదీసి బెదిరిస్తున్నాడు.

విషయం అర్థం కాక... రాగిణికి ఫోను చేసి... "ఆ రోజు కార్లో ఏం జరిగింది?" అని అడిగింది నీలిమ.

"నన్ను రేప్ చెయ్యొద్దన్నాను నా సేఫ్టీ కోసం."

అదీ జవాబు. అంతకు మించి... ఒక్క ముక్క గూడా రాగిణి నుంచి రాబట్టలేక పోయింది. ఇంకేవైనా అడిగితే... "నేనలాగే మాట్లాడుతాను. కావాలంటే..." కన్నడ సంఘం కార్యదర్శినీ, అరవసంఘం అధ్యక్షుణ్ణీ కూడా అడగండి. వాళ్ల రైడిచ్చిన రోజు కూడా ఇలాగే చెప్పాను రేప్ చెయ్యొద్దని.

నిట్టూర్చింది నీలిమ.

భర్తని ఎంత వేడుకున్నా అతను ఏం జరిగిందో చెప్పడం లేదు. ఆమె ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరు చందమైంది.

** ** **

ఆ రోజు కారులో...

"అనీల్ మీరు నాకు రైడిస్తున్నారు కదా! నన్ను రేప్ చేస్తారా? ఒక వేళ ఇలాగే నీలిమను ఎవరైనా రేప్ చేస్తే... అయినా ఇష్టమైన వాళ్లతో అయితే అది రేప్ కాదులెండి. మగవాళ్లంతా నీలిమనే చూస్తుంటారు. రెండు మూడు సార్లు ఫోన్ చేశాను మీ ఇంటికి మీరు లేరు గానీ... ఎవరో కొత్త మగవాడి గొంతుక. నీలిమ బాయ్ ఫ్రెండేమో కదూ! ఒక్కొక్కసారి ఇంట్లోనే వుండదు. ఉద్యోగం లేదంటుంది కానీ... ఊరంతా తనదిలాగేవుంది. రేప్ గురించి భయం లేదనుకుంటూ... అందుకే మీరు ఊళ్లో లేనప్పుడు రెండు మూడు సార్లు మరాఠీ మనోహర్‌తో పాటు ఇండియా హౌస్‌లో కనిపించింది.

రాగిణి తన ధోరణి మానలేదు.

అనీల్ డ్రైవ్ చేస్తున్నా.. మాటి మాటికీ చేతులు బిగుసుకుంటున్నాయి. భార్య పట్ల అనుమానం అగ్నిలా ప్రజ్వరిల్లింది.. కానీ... అతిథులు వెళ్లే వరకూ చిటపటలతో సరిపెట్టుకున్నాడు. అతనప్పుడే నిర్ణయించుకున్నాడు.

విడాకులు అవశ్యమని.

** ** **

రెండు గంటల తర్వాత ఒక నిర్ణయానికొచ్చింది నీలిమ. వాష్ రూంలో కెళ్లి ముఖం కడుక్కుని వచ్చి.. ఫ్రిజ్‌లో నుండి ఉప్మా తీసుకుని.. వేడి చేసుకుని.. తిని.. ఆరంజ్ జ్యూస్ త్రాగి... ప్రతి బుధవారం వచ్చే.. స్కార్‌బరో మిర్రర్ తిరగేస్తోంది ఉద్యోగాల కోసం. మధ్య మధ్యలో ఫోన్లు కూడా చేస్తోంది అనుకూలమైన ఉద్యోగం తనకున్న అర్హతలు చాలనుకుంటే.

అనీల్ మనసులో అనుమాన బీజాలు నాటి, వాటికి నీరు పోసి... మంచి ఎరువు వేసిన రాగిణి... తన భర్తవల్ల తీరని వాంఛలన్నీ పర పురుషుల ద్వారా తీర్చుకోవాలనే ఉబలాటంలో ఎంతోమందికి ఎన్నో చిక్కులు తెస్తూ... తాను మాత్రం సుఖంగా వుంది.

ఆ మాయలాడి మాటలకు ప్రభావితుడై, విచక్షణా జ్ఞానం కోల్పోయిన అనీల్ సంతోషంగానే వున్నాడు భార్య నుంచి విడాకులు లభించినందుకు. అతనంతకు ముందే... చెప్పాడు ఒక శ్రీలంక అమ్మాయికి, తనకు విడాకులు లభించగానే తప్పకుండా ఆమెను వివాహం చేసుకుంటానని.

అసలీ విషయాలేవీ తెలియని నీలిమ మాత్రం... పిరికితనం పనికిరాదని... సమాధానపడి... బ్రతుకు తెరువు కోసం... పరుగు తీయవల్సిన పరిస్థితి ఏర్పడింది. 'అదే విధి'

●

## వేట

రెండు గంటలు పట్టినా మెరుపులాంటి ప్లాను తట్టినందుకు మిత్ర త్రయం ఆనందపడింది. వేట ఫలించి తీరుతుందని గట్టి నమ్మకం కుదిరింది. 'రెడీ' అనుకున్నారు.

ఉమెన్స్ కాలేజీ టౌన్‌కి కొంచెం దూరంలో వుంది. రోడ్డు కటూ యిటూ రెండు బస్ స్టాపులున్నాయి. ముగ్గురిలో అందంగా వుండే ఆదిత్య జట్టుకి నాయకుడు. అతని వెంట వుండేది రఘు. సాధువుగా కనిపించే సత్యం తర్వాత సినిమా ఫక్కీలో రంగ ప్రవేశం చేయాలి. వేటలో దొరికే బేబీని మాటల్లో పెట్టి మచ్చిక చేసుకునేందుకు టౌను మొదట్లో వుండే రఘు రూమ్‌కి తీసుకురావాలి.

ఆదిత్య, రఘు బస్ స్టాప్ దగ్గర కాపు కాశారు. అక్కడున్న ముగ్గురమ్మాయిల్లో అందంగా వున్నది ఒక్కరే. ఆడపిల్లల్లో అందం తగ్గిపోతున్నందుకు జాలిపడ్డారు. ఒక బస్సు రాగానే ఇద్దరమ్మాయిలు ఎక్కి టాటా చెప్పి వెళ్ళిపోయారు. మిత్రులు సంబరపడ్డారు.

ఆలస్యం చేయకుండా కథా క్రమం ఆరంభించారు జోరుగా. చూపుల్తో గుచ్చుతున్నారు. మాటల్తో నమిలేస్తున్నారు. అమ్మాయి నిస్సహాయంగా బస్సు వచ్చే వైపు చూస్తోంది. ఎవరన్నా వస్తే లిఫ్ట్ అడిగి తప్పించుకుందామనుకునే వరకు లాక్కొచ్చారు కథని నిమిషాల్లో. అనుకున్న ప్రకారం అంత దూరంలో సత్యం స్కూటరు చూడగానే ఏమీ ఎరగనట్లు అవతలికెళ్ళిపోయారు. అయినా గమనిస్తూనే వున్నారు.

సత్యం, ఆ అమ్మాయి ఏదో మాట్లాడుకుంటున్నట్లుంది. స్కూటరు వెనక కూర్చుంది. ప్లాన్ అద్భుతంగా నడుస్తున్నందుకు వుబ్బి తబ్బిబ్బయ్యారు. కలలు కంటూ పరుగులాంటి నడకతో రఘు రూమ్ వైపు బయల్దేరారు, బస్సు కోసం నిరీక్షించేంతటి సహనం లేకపోవడం చేత.

రూం చేరారు. సత్యం, అమ్మాయి జాడ లేదు. బిత్తర పోయారు. హేండిచ్చి వుంటాడా అన్న సందేహం మొదలయింది.

ఆ అమ్మాయి సత్యం చెల్లెలని, నిజంగా తమ లాంటి కిరాతకుల చేతుల్లో పడితే తన చెల్లెలేమై వుండేదోనని సత్యం తల్లడిల్లి పోతున్న సంగతి వాళ్ళకి తెలియదు. అంతేకాదు, సత్యం మారాడని, యింకెప్పుడూ వేటకి రాడని, వేటాడే వాళ్ళని నిలువునా పాతేస్తాడని కూడా వాళ్ళకి తెలియక వదలని ఆశతో నిరీక్షిస్తున్నారు.

గోవిందరాజు రామకృష్ణారావు